ప్రజాశక్తి
బుధవారం 3 జూలై 2024
5
అల్లూరి సీతారామరాజు

భాషా వాలంటీర్ల కొనసాగింపుపై ఉత్తర్వులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఐటీడీఏ పరిధిలో పని చేస్తున్న భాష విద్యా వాలంటీర్లను ఈ ఏడాది విద్యా సంవత్సరంలో కొనసాగించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు బాష వాలంటీర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు పి.కుమారి తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఐటీడీఏ పరిధిలోని 676 పాఠశాలల్లో బాషా వాలంటీర్లు పని చేస్తున్నామన్నారు. ఈ ఏడాది జూలై నుంచి 2025 ఏప్రిల్ వరకు కొనసాగింపునకు ఐటీడీఏ పీవో, డిడి కొండలరావు ఉత్తర్వులు అందజేసినట్లు ఆమె చెప్పారు. భాష వాలంటీర్లు ఈనెల 3న బుధవారం నుంచి తమ పాఠశాలల్లో విధులకు వెళ్లాలని అధికారులు సూచించినట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో భాష వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్తర్వులు అందుకుంటున్న సంఘం నేతలు

రోడ్డును నిర్మించారు..
డ్రెయినేజీ మరిచారు..

-రోడ్డు సమీపాన నిలిచి పోతున్న మురుగునీరు
- వ్యాప్తి చెందుతున్న దోమలు
-అవస్థలు పడుతున్న కించమండ వాసులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని కించుమండలో 516 ఈ జాతీయ హైవే రోడ్డు నిర్మించారు. కానీ రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు నిర్మించక పోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వర్షపు నీరు ఎటు వెళ్లడానికి అవకాశం లేక పోయింది. దీంతో, రోడ్డుకి ఇరువైపులా నిల్వ ఉండిపోతుంది. నీరు నిలిచి పోవడంతో దుర్వాసన వెలువడడటంతో స్థానికులు, నివాస గృహాల వారు ఇబ్బంద పడుతున్నారు. మురుగు నీరు నిలిచి పోవడంతో దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఇటువంటి సీజన్లో రోడ్డు పక్కనే వర్షపు నీరు నిల్వ ఉండి పోతుండటంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఆ రోడ్డు పక్కనే ఆటోలు, ఇతర వాహనాలు పార్కింగ్ చేస్తుండగా వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మించామని, డ్రెనేజీ నిర్మాణం చేపట్టడం జరగదని హైవే అధికారులు చెబుతుండటంతో ఆ గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి కించుమండలో నిర్మించిన హైవే రోడ్డు కిరువైపులా డ్రెనేజీ కాలువలు నిర్మించాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన నిలిచిన మురుగునీరు

దోమలతో ఇబ్బందులు

హైవే రోడ్డు కిరువైపులామురుగునీటి కాలువలు నిర్మించక పోవడంతో వర్షం కురిసినప్పుడు రోడ్డు పక్కన నీరంతా నిల్వ ఉండి పోతుంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. చెడు వాసన కూడా వస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. లేకుంటే వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది .

బి.మత్య రాజు,
కించుమండ గ్రామస్తుడు

డ్రెయినేజీ నిర్మించాలి

హైవే రోడ్డు కిరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. రోడ్డు నిర్మించి నెలలు గడుస్తున్నా డ్రెనేజీ నిర్మాణం చేపట్టక పోవడంతో వర్షాలు కురిసినప్పుడు నీరంతా రోడ్డు కిరువైపులా నిల్వ ఉండిపోతుంది. దోమలు వ్యాప్తి చెందడంతో స్థనికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మాణం చేయాలి.

హెచ్‌బి చెల్లమ్మ,
సర్పంచ్, కించుమండ పంచాయితీ

మజ్జివలసలో జ్వరాలు

ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటుకు గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మజ్జి వలస గ్రామస్తులు జ్వరాలతో మంచం పట్టారు. గ్రామంలో మాదేల రాజు కుమార్, అరుణ కుమారి, మరికొందరు గిరిజనులు గత వారం రోజులుగా జ్వరాలతో బాధ పడుతున్నారు. మండలంలోని చిట్టచివరి పంచాయతీ గ్రామం కావడంతో మండల కేంద్రానికి వెళ్లి వైద్య చికిత్సలు చేసుకోవడానికి దూరంగా కావడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆ గ్రామ గిరిజనులు, పలు సంఘాల నేతలు కోరుతున్నారు.

జ్వరంతో బాధపడుతున్న గిరిజనులు

మన్యంలో వ్యాధులను అదుపు చేయాలి

-ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి- అరకులోయ:మన్యంలో మలేరియా, టైఫాయిడ్, విషజ్వారాలు, డయేరియా తదితర వ్యాధులను అదుపు చేయాలని, వైద్య సేవలు మెరుగు పర్చాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం బృందం అరకువేలి ఏరియా ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్పిటల్ వైద్యులతో సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వం ఎపిడమిక్ సీజన్‌లో మలేరియా, టైఫాయిడ్, జ్యరాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గతనెల జూన్‌లో అరకు ఏరియా ఆసుపత్రిలో 58 మలేరియా కేసులు నమోదయ్యాయన్నారు. ప్రభుత్వ యంత్రాంగం జోక్యం చేసుకుని మలేరియా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశరు.అరకు ఏరియా ఆసుపత్రికి రోజుకు 350 నుండి 400 మంది ఔట్ పేషెంట్ వస్తుంటారని, 100 వరకు ఇన్‌పేషంట్స్ జాయిన్ అవుతున్నాని, ఈ వర్షాకాలంలో ఆదివాసీ గ్రామంలో వ్యాదులు పెరుగుతున్న దృష్ట్యా వ్యాధులు అరికట్టుటకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. హాస్పిటల్ లో రోగులకు డైట్ బిల్స్ గత ఆరు నెలల నుండి రాలేదని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఏరియా ఆసుపత్రికి ప్రతి ఏడాది హాస్పిటల్ డెవలప్‌మెంట్ (హెచ్‌డిఎఫ్)ను ప్రభుత్వం విడుదల చేస్తుందని, ఈ నిధులతోనే హాస్పిటల్ లోని డ్రగ్స్, తదితర వాటిని కొనుగోలు చేస్తుంటారని, ఈ నిధులు గత ఏడాది నుండి విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే హెచ్‌డిఎఫ్ నిధులు విడుదల చేసి హాస్పిటల్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, సంఘం నాయకులు రామరావు, భగత్ రాం పాల్గొన్నారు.

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సురేంద్ర, నాయకులు

జిసిసిలో విలీనం చేయాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:గిరిజన ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న రేషన్ డీలర్లను గిరిజన సహకార సంస్థ (జిసిసి)లో విలీనం చేయాలని గిరిజన రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైకుంతం ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని బోందుగుడ వికాస్ సమావేశ మందిరంలో రేషన్ డీలర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొన్నేళు గా ప్రభుత్వం తక్కువ కమిషన్‌తో అనేక ఇబ్బందులు పడుతున్నామని, కనీసం తమకు కొన్ని డిపోలకు రూ 2 వేలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కుటుంబ పోషణకు అనేక అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం తమపై ఆలోచించి గిరిజన ప్రాంతంలో ఉన్న రేషన్ డీలర్లను గిరిజన సహకార సంస్థలో విలీనం చేసి గౌరవ వేతనం ఇచ్చేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎబి లచ్చన్న, కోశాధికారి విక్రందేవ్, సుందరరావు, రవి, సూర్య, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిరిజన రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నేతలు

ఒక్క రోజులోనే పింఛన్ల పంపిణీపై హర్షం

ప్రజాశక్తి-చింతపల్లి:ఒక్క రోజులోనే పింఛన్లు పంపిణీ చేసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందని టిడిపి మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు కిలో పూర్ణచంద్రరావు, ఆంద్రాబు లక్ష్మణ్, సీనియర్ నాయకుడు గొల్లోరి మంగు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ, గడచిన ఐదేళ్లలో ఏనాడు ఐదు రోజుల లోపు పెన్షన్ పంపిణీని పూర్తి చేయలేదన్నారు. మునుపెన్నడూ లేని రీతిలో ఎన్డీఏ కూటమి సర్కారు పెంచిన పెన్షన్ అందజేసిందన్నారు నిరంకుశ వైసిపి ప్రభుత్వానికి ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెప్పారన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు మద్దతు

ప్రజాశక్తి -అరకులోయ:గిరిజన గురుకుల విద్యా సంస్థల్లో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు తమను సిఆర్‌టి (కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్)గా మార్పు చేయాలని చేస్తున్న ఆందోళనకు గిరిజన గురుకుల అధ్యాపక సంఘం (టిఆర్ఇఎల్‌పి) సంఘీభావం తెలిపింది.పదిహేను సంవత్సరాలుగా అతిధి ఉపాధ్యాయులు, పార్ట్ టైం ఉపాధ్యాయులు, పొరుగు సేవల ఉపాధ్యాయులుగా పేర్లు మారుస్తూ కనీస వేతనాలు అమలు పరచకపోవడం దారుణమని ఆ సంఘం నేతలు తెలిపారు. ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు తమను సిఆర్‌టిలుగా మార్పు చేయాలని కోరడం సమంజసమన్నారు. అందుకు అనుగుణంగా గురుకుల అధికారులు సిఆర్‌టిలుగా మార్చి గురుకులంలో కొనసాగిస్తే గిరిజన గురుకుల విద్యాసంస్థలు అభివృద్ధి జరుగుతుందని టిఆర్ఈఐఎల్ ఏ రాష్ట్ర అధ్యక్షులు ఉషాకిరణ్, ప్రధాన కార్యదర్శి టి .శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.పారయ్యలు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు.

పోలవరం నిర్వాసితుల పునరావాసంపై

శ్వేతపత్రం విడుదల చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-విఆర్.పురం
పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసంపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో నందు మంగళవారం పంకు సత్తిబాబు అధ్యక్షతన జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో సీతారాం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం కాపర్ డ్యామ్‌ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని నిపుణులను రప్పించారుగాని, పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితుల కోసం ఒక్క మాట కూడా మాట్లాడలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పోలవరం నిర్వాసితులను నట్టేట ముంచిందని, కనీసం ఈ ప్రభుత్వమైనా నిర్వాసితులకు న్యాయం చేస్తుందనుకుంటే, ఎంతసేపు ప్రాజెక్టు గురించే మాట్లాడుతున్నారు తప్ప నిర్వాసితుల గోడు వినిపించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్ళలో నిర్వాసితులు, నిర్వాసిత గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గతంలో వచ్చిన వరదల్లో గ్రామాలకు గ్రామాలు మునిగిపోయాయని, అందువల్ల కాంటూరు లెక్కలు తిరిగి సరి చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ధరల ప్రకారం నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాస ప్యాకేజీ ప్రకటించాలని, 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరినీ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు డ్యామ్ నిర్మాణంలో వెల్లడైన అవకతవకలు, ఇతర అంశాలపై కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, అవకతవకలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మొబైల్ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

వర్షాకాలం మొదలవడంతో ఏజెన్సీలో విష జ్వరాలతో ఇక్కడి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, సరైన వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని సీతారాం ఆవేదన వ్యక్తం చేశారు. విష జ్వరాల నుండి ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే మొబైల్ వైద్య శిబిరాలు గిరిజన గ్రామాల్లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, విఆర్.పురం, చింతూరు మండల కార్యదర్శులు సోయం చిన్నబాబు, సీసం సురేష్, నాయకులు పులి సంతోష్ కుమార్, పూనం ప్రదీప్ కుమార్, కుంజ నాగిరెడ్డి, కారం సుందరయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారామ్

శిథిలావస్థలో జెర్రిల పాఠశాల భవనం

-అందులోనే విద్యార్థులకు భోజనాలు
-ఎప్పుడు కూలిపోతుందోనని తల్లిదండ్రుల్లో భయాందోళన

ప్రజాశక్తి -సీలేరు
జీకే వీధి మండలం జెర్రిల పంచాయతీ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో భవనం శిథిలాస్థకు చేరుకుంది. ఈ భవనంలోనే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వంట చేసి వడ్డిస్తుండగా, అది ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. జెర్రిల పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండగా, ఆ భవనంలో పశువులు తిష్ట వేసి మలమూత్రాలు విసర్జిస్తున్నాయి. మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో శిథిలమైన, అపరిశుభ్రంగా ఉన్న ఆ భవనంలోనే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వంటలు చేస్తున్నారు. అందులోనే విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్నారు. అపరిశుభ్రమైన వాతవరణంలో భోజనాలు వండి వడ్డించడం వల్ల విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. మరో వైపు ఆ భవనం కూలిపోయే స్థితిలో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి వెంటనే పాఠశాలకు వంటశాలను నిర్మించి విద్యార్థులకు భోజన వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో ఉన్న భవనం వద్ద మధ్యాహ్నం భోజనం వడ్డిస్తున్న దృశ్యం

విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ బ్రహ్మజీరావు

డిఇఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మజీరావు మంగళవారం ఆకస్మిత తనిఖీలు నిర్వహించారు. నాబార్డు నిధులతో మంజూరైన పాఠశాల భవనం స్థితిగతులపై ఆరా తీశారు. అనంతరం సీలేరు గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమం పాఠశాలను గురుకుల పాఠశాలలో తనిఖీలు చేశారు. తరగతి గదులకు వెళ్లి ఏమైనా సమస్యలు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని డిఇఓ దృష్టికి టీచర్లు తీసుకెళ్లారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో మూడు నుంచి ఆరో తరగతి వరకు ఒకే క్లాసు రూమ్‌లో విద్యాబాధన చేస్తున్నామని తెలియజేశారు. క్లాస్ రూమ్‌లు తక్కువగా ఉన్నప్పుడు పదవ తరగతి అప్‌గ్రేట్ చేయమని ప్రతిపాదన ఎందుకు పంపారని ఉపాధ్యాయులను డిఇఒ ప్రశ్నించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల విడుదలైన సప్లమెంటరీ ఫలితాల్లో రాష్ట్రంలో తొమ్మిదవ స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా నిలిచిందని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో అన్ని పాఠశాలల్లో అడ్మిషన్లకు డిమాండ్ ఉందన్నారు. జిల్లాలో ఉపాధ్యాయు లేని పాఠశాలలో ఎక్కువగా లేవని, ఎక్కడైనా కొరత ఉంటే ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి విద్యార్థులకు సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అల్లూరు జిల్లా 22 మండలాల్లో 260 పాఠశాలలో భవనాలు లేని వాటికి ప్రతిపాదన పంపేమని డిఇఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు రక్తనాళాల జబ్బులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-చింతూరు : హైదరాబాద్ ఏషియన్ వాస్క్యులర్ ఆసుపత్రి సహకారం, చింతూరు ఐటిడిఎ ఆధ్వర్యాన రక్తనాళాల సంబంధిత జబ్బులకు ఉచిత వైద్య శిబిరం స్థానిక ఏరియా ఆసుపత్రిలో బుధవారం నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తనాళాల (వాస్కులర్) సంబంధిత జబ్బులు అంటే మోకాలు కింది భాగంలో మెలికలు తిరిగి ఉబ్బిన రక్తనాళాలు ఉండటం, సాలె పురుగు లాంటి రక్త నాళాలతో బాధపడటం, పాదాల వాపు, కాళ్ళకు, తలకు రక్త సరఫరా లేకపోవడం తదితర లక్షణాలు, జబ్బులతో అనేక మంది స్త్రీ, పురుషులు బాధపడుతున్నారని తెలిపారు. ఇటువంటి జబ్బులకు వైద్యం చేయించుకోవాలంటే చాలా ఖర్చు అవుతుందని, అలాంటి వారికి ఆర్థిక ఇబ్బందులు తగ్గించడానికి ఏషియన్ వ్యాస్కులర్ హాస్పిటల్ వారిని సంప్రదించి ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని బాధిత రోగులు వినియోగించుకోవాలని కోరారు.

బడి ఈడు పిల్లలను గుర్తించాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : గ్రామాల్లో బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలకు పంపించాలని కొయ్యూరు ఐసీడీఎస్ సీడీపీవో విజయ కుమారి ఆదేశించారు. కొయ్యూరు ఐసీడీఎస్ సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ పాఠశాలలకు వచ్చే చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి నెలా పిల్లల ఎత్తు, బరువును విధిగా నమోదు చేయాలని సూచించారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ఆశాల సమావేశంలో సిఐటియు జిల్లా నేత అప్పలనాయుడు

ప్రజాశక్తి-కొయ్యూరు
ఆశా కార్యకర్తలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు యామల అప్పలనాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని రాజేంద్రపాలెం పిహెచ్‌సి పరిధి ఆశా కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఇందులో పాల్గొన్న అప్పలనాయుడు మాట్లాడుతూ జనాభా తక్కువ ఉన్న ప్రాంతంలో పని చేసే ఆశా కార్యకర్తలకు వేతనం, పారితోషకం కలిసి రూ.5వేలు నుండి రూ.6వేలు మాత్రమే వస్తుందని, ఇది అన్యాయమని పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వృద్ధులకు, చిన్నపిల్లలకు, గర్భిణులకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా గుర్తించి వారిని ఆసుపత్రికి తీసుకెళ్లి వారి ఉండి వైద్యం చేయించే ఆశా కార్యకర్తలకు కష్టానికి తగిన వేతనం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, ఆశాలకు వచ్చే తక్కువ వేతనంతో కుటుంబాలు బతకలేక చావలేక, అప్పులకు లోనై తీవ్ర ఇబ్బందుల పడుతున్నారని వాపోయారు. కొత్త ప్రభుత్వమైనా ఆశాలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, ఏజెన్సీలోని సిహెచ్‌డబ్ల్యులను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని, యూనిఫామ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆశా యూనియన్ నాయకులు ఆమూర్ దేవుడమ్మ, లోతా సరోజినీ, సిగ్గే నాగమణి, కొర్రు జోగ్‌రత్నం, తుబె మల్లమ్మ, జోరంగి చిలకమ్మ, సావిత్రి, బుదారాళ్ల రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు అప్పలనాయుడు

జాతీయస్థాయి కుస్తీ పోటీలకు కెజిబివి విద్యార్థినులు

ప్రజాశక్తి-కొయ్యూరు
ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉద్ధమ్‌సింగ్ నగర్లో ఈనెల 5 నుండి 7వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి కుస్తీ పోటీలకు కొయ్యూరు కెజిబివిలో ప్రథమ, ద్వితీయ ఇంటర్ చదువుతున్న ఏడుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు ఆ విద్యాలయం ప్రత్యేక అధికారి పరిమళ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు బయలుదేరి వెళ్లారని చెప్పారు. వారు జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు వీరే...

తనిఖీ చేస్తున్న సిడిపిఒ

అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన సిడిపిఒ

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ అమూరు అంగన్వాడి సెంటర్ను సిడిపిఓ సిహెచ్ బాలామణిదేవి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. 14 మంది పిల్లలకు నలుగురు ఉండటంతో టీచర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.అంగన్వాడి టీచర్ మెనూ ప్రకారంగా భోజనం పెడుతున్నారా లేదా అని గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారంగా భోజనం పెట్టలేదని చెప్ప లేదని గ్రామస్తులు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడి టీచర్ నెల రోజుల్లోగా మారకపోతే వచ్చే నెల విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఇళ్లలో స్ప్రేయింగ్ చేస్తున్న సిబ్బంది

జాకరవలసలో స్ప్రేయింగ్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి బల్లుగుడ జాకరవలస గ్రామంలో మంగళవారం స్థానిక ప్రాథమిక వైద్యాధికారి పి రాంబాబు ఆధ్వర్యంలో ఏసిఎం స్ప్రేయింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తుగా ప్రతి ఒక్కరూ తమ నివాస గృహాల్లో స్ప్రేయింగ్ చేయించుకోవాలన్నారు. గ్రామ పరిసరాల్లో స్ప్రేయింగ్ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శౌరి, హెచ్ఎస్ రామారావు, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఏ పిఒ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని పలు పాఠశాలల్లో ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ సుడిగాలి పర్యటన సోమవారం చేపట్టారు. గూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. మెనూ అమలుపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రశ్నలు విద్యార్థులను అడిగి ఆయన సమాధానం రాబట్టారు. భారతదేశ చిత్ర పటం నమూనాని ఆయన గీసి రాష్ట్రాల పేర్లు గుర్తించి చెప్పాలని కోరారు.అనంతరం ఐటిడిఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ, విద్య పట్ల ఆసక్తి ఉంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. విద్యపై పట్టుదల కలిగి శ్రద్ధతో చదువుకోవాలన్నారు.



బోధిస్తున్న పిఒ అభిషేక్

వర్షాలకు రోడ్లు ఛిద్రం

బురదమయమైన రహదారి

ప్రజాశక్తి-యంత్రాంగం

అనంతగిరి: మండలంలోని వారం రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మారుమూల గిరిజన గ్రామాలలో రోడ్లు కోతకు గురవుతున్నాయి. దీంతో, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు నెలకొన్నాయి. మోకాళ్ళంత లోతులో బురదమయం కావడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని కివర్ల పంచాయతీ పరిధి బొంగిజా మీదుగా లుంగపర్తి పంచాయతీ పీడీవలస, వాలసి పంచాయతీ జెండగరువు నుండి ఉటగెడ్డ, బొడ్డపాడు నుండి చీమగెడ్డ, పుట్టపాడు, లుంగపర్తి పంచాయతీ మెట్టవలస నుండి ఓనకొండ, చిలకగెడ్డ పంచాయతీ జీలుగులపాడు నుండి దబ్బలపాడు మీదగా విజయనగరం జిల్లా మెంటడ మండలం అడ్డతీగల పంచాయతీ లకు అనుకుని పలు గ్రామాల రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. పెదబిడ్డ పంచాయతీ దనకొట, డి.జంగవలస గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రోడ్ల మరమ్మతు చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు.

కోతకు గురైన రోడ్డు

పెదబయలు: మండలంలోని మారుమూల మన్యంస్తు ప్రభావిత ప్రాంతమైన ఇంజరి తారు రోడ్డు గతవారం రోజులుగా కురిసిన వర్షానికి కోతకు గురైంది. గోమంగి పంచాయతీ సరిహద్దు ప్రాంతం నుండి ఇంజరి వరకు గత ఏడాది తారు రోడ్డు నిర్మించారు. ఇంజరి రోడ్డు కొండల మధ్య నుండి నిర్మించడంతో వర్షపు నీరుతో ఇరువైపుల కోతకు గురైంది. ద్విచక్ర వాహనాలు ప్రయాణించడానికి వీలు లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేపట్టి రహదారి సౌకర్యం కల్పించాలని ఇంజరి ప్రజలు కోరుతున్నారు



కోతకు గురైన ఇంజరి రోడ్డు

అతిసార, డెంగీపై అవగాహన

అతిసార, డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-యంత్రాంగం

హుకుంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సోమవారం డెంగీపై అవగాహన ర్యాలీ చేపట్టారు. వైద్యాధికారిణి శాంతి మాట్లాడుతూ, డెంగ్యూ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు.తీవ్ర జ్వరము, తలనొప్పి, కీళ్ళ, కండరాల నొప్పి, వికారం, చర్మంపై దద్దుర్లు, అలసట కలిగినప్పుడు దగ్గర్లో ఉన్న ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. నీరు నిలవ లేకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ఎంపిహెచ్ఈఓ మహేష్, టిహెచ్ఎస్ జమ్మి, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

అరకులోయ: మండలంలోని గన్నెల పిహెచ్సి వైద్య సిబ్బంది డయేరియా పై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డయేరియా వ్యాధి సోకకుండా నివారణపై తీసుకోవలసిన జాగ్రత్తలపై పిహెచ్ సి వైద్యాధికారిణి సిహెచ్ కమల కుమారి అవగాహన కల్పించారు. ఐదు సంవత్సరాల పిల్లలకు డయేరియా రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రమాద సంకేతాలు, ఓఆర్ఎస్ ద్రావణం వినియోగం, జింక్ మాత్రల వాడే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మూర్తి, హెచ్వి రత్నం, ఏఎన్ఎంలు, సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో మెనూ అమలు చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తిక్, జీవన్ మంగళవారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయలేదని, ఉడికి, ఉడకని అన్నం పెడుతున్నారన్నారు. ఈ కారణంగా అనేకమంది విద్యార్థులకు కడుపు నొప్పులు, వాంతులు విరోచనాలతో ఆస్పత్రుల్లో చేరుతున్నారని తెలిపారు. విద్యార్థులకు రక్తహీనత సమస్య ఎక్కువ అవుతున్న పరిస్థితి ఉందన్నారు.గత రెండేళ్లలో ఆశ్రమ విద్యా సంస్థల్లో 50 మంది పైగా విద్యార్థులు చనిపోయారని తెలిపారు. మండల స్థాయిలో అధికారులు తక్షణమే స్పందించి ఆశ్రమాల్లో మెనూ అమలుపై పర్యవేక్షించాలని వారు డిమాండ్ చేశారు.

బాధితులను తరలిస్తున్న స్థానికులు

ఆటో బోల్తా : పలువురికి గాయాలు

ప్రజాశక్తి-పాడేరు: ఘాట్ లోని పాదాల వద్ద మంగళవారం మధ్యాహ్నం ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో, పలువురు గాయాల పాలయ్యారు.. ఆటో ప్రమాదం జరిగిన సమయంలో అదే మార్గంలో వెళుతున్న పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు వెంటనే స్పందించి తన గన్మెన్ సాయంతో బోల్తా పడిన ఆటోను పైకెత్తించారు. ఆటోలో ప్రయాణిస్తూ గాయపడిన క్షత గాత్రులను మరొక ఆటోలో ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మెల్యే పాడేరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో ఫోన్లో మాట్లాడి గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

వాహన తనిఖీలు

ప్రజాశక్తి - చింతపల్లి : ప్రమాదాల నియంత్రణలో భాగంగా మండల కేంద్రంలో హనుమాన్ కూడలి సహా పలు ప్రాంతాల్లో పోలీసులు మంగళవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. స్థానిక సీఐ రమేష్ ఆధ్వర్యంలో హనుమాన్ కూడలి వద్ద ఎస్సై అరుణ్ కిరణ్ వాహన రికార్డుల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పరిమితికి మించి ప్రయాణం చేస్తున్న ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తనిఖీలతో పాటు, అనుమానితులను ప్రశ్నించడం జరుగుతుందన్నారు. లైసెన్స్ లేని వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సేంద్రీయ సాగుపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్

సేంద్రీయ సాగుపై అవగాహన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: వ్యవసాయం సాగు చేస్తున్న గిరి రైతులు రసాయన ఎరువులతో కాకుండా ప్రకృతి సేద్యమైన సేంద్రీయ ఎరువులతో వ్యవసాయ పంటలను సాగు చేయాలని కొర్రాయి పంచాయతీ సర్పంచ్ పి కొములు సూచించారు. ఆ పంచాయతీలోని పెద్ద అంజోడ గ్రామంలో గుల్లి రాగి పంట వరుస సంఖ్యలో సాగు చేసే విధానంపై గిరి రైతులకు ఉద్యానవన శాఖ అసిస్టెంట్ పి.సొయిత రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో సహజ సిద్ధంగా దొరికిన ఆవు పేడను ఎరువులుగా ఉపయోగించుకొని వ్యవసాయ పంటలను సాగు చేసుకునే వారన్నారు. ఈ విధంగా సాగు చేయడంతో వీటిని ఉపయోగించిన వారు కూడా ఆరోగ్యంగా ఉండవచ్చునని చెప్పారు.

పూరీ రథయాత్రకు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఒడిశాలోని పూరిలో రథయాత్ర, గుండిచాయాత్ర, బహుదయాత్ర, సునాబేషా సందర్భంగా ప్రయాణీకులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి, ఈస్ట్కోస్ట్ రైల్వే హరిపూర్గ్రామ్, అర్గుల్ మీదుగా పలు అన్ రిజర్వ్డ్ ప్యాసింజర్ ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 08345 గుణుపూర్-పూరి స్పెషల్ ఈనెల 6,14,16, తేదీలలో గుణుపూర్లో రాత్రి 23.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.15 గంటలకు పూరీ చేరుకుంటుంది. 08346 పూరి-గుణపూర్ ఈనెల 7, 15, 17 తేదీలలో రాత్రి 21.20 గంటలకు పూరిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు గుణుపూర్ చేరుకుంటుంది.

08331 పలాస-పూరి ప్రత్యేక రైలు మీదుగా ఈనెల 07, 15,17 తేదీల్లో అర్ధరాత్రి 12.15 గంటలకు పలాసలో బయలుదేరి, అదే రోజు ఉదయం 5.35 గంటలకు పూరీ చేరుకుంటుంది. 08332 పూరి-పలాస స్పెషల్ ఈనెల 8, 16, 18తేదీలలో ఉదయం 4గంటలకు పూరిలో బయలుదేరి అదే రోజు 10.05 గంటలకు పలాస చేరుకుంటుంది.

08347 విశాఖపట్నం-పూరి ప్రత్యేక రైలు ఈనెల 6, 14, 16 తేదీలలో మధ్యాహ్నం 14.00 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి, అదే రోజు 22:45 గంటలకు గంటలకు పూరీకి చేరుకుంటుంది. 08348 పూరీ-విశాఖపట్నం ప్రత్యేక రైలు ఈనెల 8, 16, 18 తేదీలలో అర్ధరాత్రి 1.45 గంటలకు పూరి నుండి బయలుదేరి అదే రోజు ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

08349 జగదల్పూర్-పూరి స్పెషల్ రైలు ఈ నెల 6, 14,16 తేదీలలో ఉదయం 10.45 గంటలకు జగదల్పూర్ నుండి బయలుదేరి అదేరోజు అర్ధరాత్రి 00.45 గంటలకు పూరీ చేరుకుంటుంది.08350 పూరీ-జగ్దల్పూర్ స్పెషల్ ఈనెల 8, 16, 18 తేదీలలో అర్ధరాత్రి 00.15 గంటలకు పూరి నుండి బయలుదేరి, అదే రోజు మధ్యాహ్నం 15.10 గంటలకు జగదల్పూర్ చేరుకుంటుంది.

అధికారిక యాప్, వెబ్సైట్లలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు

వినియోగదారులకు ఎపిఇపిడిసిఎల్ సిఎండి సూచన

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎపిఇపిడిసిఎస్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను సంస్థ వెబ్సైట్, మొబైల్ యాప్ ద్వారా చెల్లించవచ్చని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ప్రకటనలో తెలిపారు. రిజర్వ్బ్యాంకు ఆఫ్ ఇండియా మార్గదర్శకాలను అనుసరించి ఇకపై ఫోన్పే, గూగుల్పే, పేటిఎం, ఇతర యూపీఐ యాప్స్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఎపిఇపిడిసిఎల్ పేరు కనిపించదన్నారు. అందుకే విద్యుత్ క వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్, eastern powerను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్లోడ్ చేసికొనిగానీ లేదా సంస్థ వెబ్సైట్ www.apeasternpower.com ద్వారాగానీ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు. ఎపిఇపిడిసిఎల్ మొబైల్ యాప్లోగానీ, లేదా సంస్థ వెబ్సైట్లో బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్పే, గూగుల్పే పేటిఎం ఇతర యుపిఐ యాప్స్తో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ కూడా వాడుకోవచ్చని వినియోగదారులకు సూచించారు.

నేడు విశాఖ జూపార్కుకు కొత్త నేస్తాల రాక

ప్రజాశక్తి - ఆరిలోవ : గుజరాత్లోని జమ్నాగర్ గ్రీన్స్ జులాజికల్ రెస్క్యూ అండ్ రీహెబిటేషన్ సెంటర్, రాధాకృష్ణా టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్టుల మధ్య కుదిరిన జంతు మార్పిడి ఒప్పందం ద్వారా విశాఖలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు బుధవారం కొత్త జంతువులు, పక్షులు రానున్నట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ జూ పార్కుకు స్ట్రిప్డ్ హైనాలు రెండు, హాగ్ డీర్ ఒక జత, పెయింటెడ్ స్టార్క్, గ్రే పెలికాన్, స్టార్ తాబేళ్లు, ఘరియాల్, జంగిల్ క్యాట్స్, ఢోలే, తోడేళ్ళు, గార్లు రానున్నట్టు తెలిపారు. విశాఖ జూపార్కు నుంచి కామన్ మార్మోసెట్, స్కార్లెట్ మాక్యా, గ్రీన్ వింగ్డ్ మాక్యా, మీడియం సల్ఫర్ కాక్టూ, స్క్విరెల్ మంకీస్, స్లెండర్ టైల్డ్ మీర్ కాట్, రెడ్ నెక్డ్ వాల్బేలు గుజరాత్ జూపార్కుకు తీసుకువెళతారన్నారు.

వెలుగు సిసిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -సీలేరు : రుణం ద్వారా పొందిన మేకలకు ఇన్సూరెన్స్ నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వెలుగు సిసి గోవిందుపై చర్యలు తీసుకోవాలని జికె.వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధిలోని డ్వాక్రా మహిళలు డిమాండ్ చేశారు. బాధిత డ్వాక్రా మహిళలు తెలిపిన వివరాలు ప్రకారం... దారకొండ పంచాయతీ డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి పథకం కింద 2017-18 లో మేకలు పెంపకం కోసం నాటి వెలుగు సిసి గోవిందు ఆధ్వర్యాన ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ.30వేలు చొప్పున రుణం మంజూరు చేసి వారి ఖాతాల్లో జమ చేసింది. ఈ రుణం మంజూరు నిమిత్తం ఒక్కొక్కరు నుంచి రూ.2000 చొప్పున నాటి వెలుగు సిసి గోవిందు లంచం తీసుకున్నారు. స్వయం ఉపాధి పథకం కింద పొందిన మేకలు జబ్బుల వల్ల మృత్యువాత పడ్డాయి. అయితే సిసి గోవిందు నిర్లక్ష్యంగా వ్యవహరించి మేకలకు ఇన్సూరెన్స్ నమోదు చేయకపోవడంతో మేకలు మృతి చెందినా బాధిత డ్వాక్రా మహిళలకు ఇన్సూరెన్స్ రాలేదు. దీంతో నష్టపోయిన డ్వాక్రా మహిళలు ఆ రుణం కట్టలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వెలుగు సిసిగా పని చేస్తున్న బంగారయ్య మేకల పెంపకం కోసం తీసుకున్న రుణం వెంటనే బ్యాంకులకు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం దారకొండలో డ్వాక్రా మహిళలతో వెలుగు సిసి బంగారయ్య సమావేశమై లోను కట్టాలని కోరారు. అయితే ఇంతకు ముందు వెలుగు సిసి గోవిందు నిర్లక్ష్యం వల్ల మేకల మృత్యువాత గురైనా ఇన్సూరెన్స్ రాలేదని, తాము తీవ్రంగా నష్టపోయామని, రుణం చెల్లించలేమని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు. దీంతో ఈ విషయాన్ని అధికారులు దృష్టి తీసుకెళ్తారని ప్రస్తుత సిసి బంగారయ్య హామీ ఇచ్చారు.

దారకొండలో డాక్రా మహిళలతో సమావేశమైన బంగారయ్య

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

ప్రజాశక్తి -సీలేరు : జికె.వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు నాయకులు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు ఎస్కె.సుభాన్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం బ్రాంచి అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మణ్, విష్ణుకుమార్ మాట్లాడుతూ సీలేరు పంచాయతీ పరిధిలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఆరుగురు పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏళ్ల తరబడి పనులు చేస్తున్నా వీరికి కనీస వేతనం ఇవ్వడం లేదని, ఉద్యోగ భద్రత కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి పగలు తేడా లేకుండా, ఎండనక, వాననక గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు చేస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులకు శ్రమకు తగ్గ ఫలితం దక్కకపోవడం విచారకరమన్నారు. నెలకు కేవడం రూ.5వేలు నుండి రూ.6వేలు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారని, నిత్యావసరాల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో చాలీచాలని వేతనాలతో కార్మికుల కుటుంబాల పోషణ ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికులకు తక్షణమే జీతాలు పెంచే విధంగా పంచాయతీ కార్యదర్శి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు వారాంతపు సెలవులు, ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో గుమస్తా ప్రకాష్కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

వినతి పత్రం ఇస్తున్న విష్ణుకుమార్

ఘాట్ రోడ్డులో కూలిన భారీ వృక్షం

తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు

ప్రజాశక్తి -సీలేరు : నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులకు జీకే వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్లో ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలిపోయింది. అయితే దానిని తొలగించేందుకు ఆర్ అండ్ బి అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. రహదారి పక్క నుంచి వెళ్దామంటే బురదలో వాహనాలు కూరుకుపోయే ప్రమాదముంది. దీంతో బస్సు డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు అష్ట కష్టాలు పడుతున్నారు. చెట్టు కూలి నాలుగు రోజులు గడుస్తూనే తొలగించేందుకు ఆర్ అండ్ బి అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దారకొండ ఘాట్ రోడ్లో పడి ఉన్న భారీ వృక్షాన్ని తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని వాహన చోదకులు డిమాండ్ చేస్తున్నారు.

నాలుగు రోజులుగా ధారకొండ ఘాట్ ప్రధానరోడ్డుపై ఉన్న భారీవృక్షం

రామాలయం చోరీ కేసును ఛేదించేనా?

ప్రజాశక్తి-విఆర్.పురం: మండలంలోని శ్రీరామగిరి శ్రీసుందర సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో 500 ఏళ్ల చరిత్ర కలిగిన ఇత్తడి లోహపు వాహన విగ్రహాలు చోరీ కేసును ఛేదిస్తారా? అన్న సందేహాలు స్థానికుల్లో కలుగుతున్నాయి. జూన్ 27న గురువారం రాత్రి ఆలయంలో అశ్వ, గరుడ, హనుమంతు వాహన విగ్రహాలు అపహరణకు గురైన విషయం విధితమే. దీనిపై శనివారం పోలీసులు డాగ్ స్క్వాడ్తో పరిశీలించారు. ఆదివారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆలయాన్ని సందర్శించారు. అయితే ఇంకా నిందితులను గుర్తించడంలో పురోగతి కనిపించడం లేదు. ఈ ఆలయంలో ఐదు సార్లు వివిధ విగ్రహాలు, వాహన విగ్రహాలు అపహరణకు గురయ్యాయి. ఈ చోరీ కేసుల్లో దొంగలను పట్టుకోవడంలో ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ విఫలమైందన్న విమర్శలు ఉన్నాయి. తాజా చోరీ కేసులో అసలు దోషులను ఇంకా కనిపెట్టకపోవటం ఏమిటని గ్రామ ప్రజలు, భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే విలువైన పంచలోహపు విగ్రహాలు మాయమయ్యాయని, మళ్లీ ఇప్పుడు అదే పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మరో దొంగతనం జరగడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పోలీసులు దృష్టి సారించి శ్రీరామగిరి రామాలయంలో చోరీకి పాల్పడిన నిందితులను గుర్తించి అరెస్టు చేయాలని, అపహరణకు గురైన వాహన విగ్రహాలను రికవరీ చేసి ఆలయంలో నెలకొల్పాలని స్థానికులు కోరుతున్నారు.

టేకు దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెం పంచాయతీ పరిధి సోలాబు గ్రామ శివారులో ఉన్న జీడిమామిడి తోటల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఆరు టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఎస్వో నూకరాజు తెలిపారు. ముందస్తు సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా, టేకు దుంగలు పట్టుబడ్డాయని పేర్కొన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని కాకరపాడు అటవీ డిపోకు తరలించామని, వాటి విలువ సుమారు రూ.26వేలు ఉంటుందని తెలిపారు

స్వాధీనం చేసుకున్న టేకుదుంగలు

అత్యాచార కేసులో నిందితునికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి-కొయ్యూరు : అత్యాచారం కేసులో నేరం నిర్ధారణ కావడంతో ఏ-1 ముద్దాయికి 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.9వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్లు కొయ్యూరు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... 2021 సంవత్సరంలో కొయ్యూరు పోలీస్టేషన్లో మానభంగం కేసు నమోదైంది.

దీనిపై విశాఖపట్నం (ఎస్సీ, ఎస్టీ) కోర్టులో నేరం రుజువు కావడంతో ఏ-1 ముద్దాయి సర్కారపు గిరీష్కు పదేళ్ల జైలు, రూ.9వేలు జరిమానా విధించగా, ఇదే కేసులో ముద్దాయిలైన సుర్ల విజయజ్యోతికి ఆరు నెలలు జైలు శిక్ష లేదా రూ.6 వేలు జరిమానా, సుర్ల కొండమ్మ, సుర్ల కృష్ణ, రేగల తలుపులమ్మలకు ఒక్కొక్కరికి మూడు నెలలు జైలు శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీస్ సిబ్బంది, సక్రమంగా విచారణ జరిపిన స్పెషల్ పీపీ బి.వెంకటరమణమూర్తిలను జిల్లా ఎస్పీ అభినందించారు.

వరి నారు మడుల పరిశీలన

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని శింగవరం శివారులో ఉన్న వరి నారుమడులను రైతులతో కలిసి మండల వ్యవసాయ అధికారి డి.ఉమాదేవి మంగళవారం సందర్శించారు. పది సెంట్ల నారుమడికి నాలుగు కేజీల యూరియా, ఎనిమిది కేజీల ఎస్ఎస్పీ, 2 కేజీల పొటాష్ ఎరువులను వేయాలని సూచించారు. నారుమళ్లు పోసే ముందు విత్తన శుద్ధి చేస్తే విత్తనాల ద్వారా వ్యాప్తి చెందే అగ్గి తెగులు కొంతవరకు నివారించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు